
బోథ్: సీడ్‌డ్రిల్ మిషన్‌తో సోయా విత్తనాలు వేస్తున్న రైతులు


ఇంద్రవెల్లి: పత్తి విత్తనాలు పెడుతున్న కూలీలు

# ఊపందుకున్న వానకాలం సాగు పనులు

బోథ్/ ఇంద్రవెల్లి/భీంపూర్, జూన్ 16: వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతులు పంట చేలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే బోథ్ మండలంలోని రైతులు పత్తి, సోయా, కంది, ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు కేస్లాగూడ, ఏమాయికుంట, అంజి, హర్కాపూర్, దస్నాపూర్, ముత్నూర్, ధనోరా(బీ), మెండపల్లి, దేవాపూర్ గ్రామాల రైతులు పత్తి, భీంపూర్ మండలంలోని రైతులు పత్తి, కంది విత్తనాలు వేశారు. మరికొందరు విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. బోథ్ మండలంలో సీడ్ డ్రిల్ మిషన్ సహాయంతో సోయా విత్తనాలు వేశారు. గుంటుకల సహాయంతో తేరచాళ్లను చదును చేశారు. పత్తి విత్తే రైతులు ఎద్దుల కురెలతో విత్తనాలు వేశారు. ఇంకొంత మంది రైతులు రెండు, మూడు మంచి వర్షాల కురిసిన తర్వాతనే విత్తనాలు వేసుకోవాలని నిరీక్షిస్తున్నారు. భీంపూర్ మండలంలో చెరువులు ,కుంటలు సమీపంలో ఉన్న రైతులు, పెన్‌గంగ పరీవాహక రైతులు కొంతమంది సాగునీటి లభ్యత ఉంటే నీటి తడులిచ్చే ప్రయత్నం చేస్తున్నారు.


భీంపూర్: విత్తనాలు వేస్తున్న రైతులు

# ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువు

ఖానాపూర్, జూన్ 16 : ఖానాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువైందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సబ్‌డివిజన్ కేంద్రంగా ఉన్న పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ముందు నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు నిలిచి ఉండడంతో విద్యార్థులు భయంభ్రాంతులకు గురవుతున్నానని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్యం చేస్తున్నారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే జంకుతున్నారు. ఏ ప్రమాదం జరగకుండా తిరిగి క్షేమంగా తమ పిల్లలు ఇంటికి వస్తారో రాని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని అంటున్నారు. వాహనాలను తొలగిస్తే తము ధైర్యంగా పాఠశాలకు వెళ్తామని విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు సైతం ప్రభుత్వ పాఠశాలల తీరు అధ్వానంగా ఉందని పేర్కొంటున్నారు. ఖానాపూర్‌తో పాటు పెంబి, కడెం మండలాల్లోని వందల గ్రామాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఈ పాఠశాల, జూనియర్ కళాశాలకు విద్యానభ్యసించాడనికి వస్తున్నారు. విద్యశాఖ, ఉన్నతాధికారులు, పాలకులు దృష్టి సారించి పాఠశాల ముందు నిలిపే వాహనాలను తొలగించాలని వేడుకుంటున్నారు.


ప్రభుత్వ పాఠశాల ఎదుట నిలిచిన భారీ వాహనాలు


పార్కింగ్ కోసం పాఠశాల గోడ కూల్చిన వాహనదారులు

## అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న యువకులు

కుబీర్, జూన్ 16 : మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కస్తూరే రాహుల్, ఉపాధ్యక్షుడిగా దుగ్గే నాగారావ్, ప్రధాన కార్యదర్శిగా ఉమ్మే భీంరావ్, సహ కార్యదర్శులుగా భూషణ్, సచిన్, కోశాధికారిగా జంగ్మే దత్తాత్రితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారిని బుద్ధ భవన్‌లో యువకులు సన్మానించారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే దంపతులు


ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఉట్నూర్ రూరల్, జూన్ 16: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే సతీమణి ద్రుపద, కుమారులు తనీశ్, నితీశ్ ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ సమస్యల గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఖానాపూర్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఖానాపూర్, జూన్ 16: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు ఆదివారం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయ ఆవరణలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేయగా 50 మంది యువకులు, నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు దయానంద్, రమేశ్, శంకర్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్, జూన్16: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినం సందర్భంగా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో అభిమానులు, కార్యకర్తలు దవాఖానలో రోగులకు పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గజేందర్ హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఉట్నూర్, జూన్ 16 : గాదిగూడలో ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్‌ను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కట్టుకున్న భార్యనే సుఫారీలను ఏర్పాటు చేయడం చాలా బాధకరమన్నారు. మొత్తానికి మంచి ఉపాధాయుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాజుకు ఆప్తబంధు పురస్కారం


రాజును సన్మానిస్తున్న డా. అనిల్ కుమార్ జాదవ్

భైంసా, జూన్ 16 : భైంసాలోని కృష్ణ నర్సింగ్ హోమ్, జీడీఆర్ మల్టీ స్పెషాలిటీ దవాఖానలో పని చేస్తున్న రాజుకు ఆప్తబంధు పురస్కారం లభించింది. జీడీఆర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ ఆదివారం రాజును శాలువాతో సన్మానించి ఆప్తబంధు పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో దవాఖాన కోఆర్డినేటర్ జాదవ్ పుండలిక్ రావు పాటిల్, ఉద్యోగులు, ఆయాలు, కర్మచారులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కుంటాల, జూన్ 16 : మండలంలోని ఓలా గ్రామంలో రైతు ఖమర్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందింది. గేదె విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. పశువైద్యాధికారి గేదెకు పంచనామా నిర్వహించారు. అనంతరం సంఘటన స్థలాన్ని విద్యుత్ సిబ్బంది పరిశీలించారు.


నేరడిగొండ : ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీమంత్రి జోగు రామన్న


భీంపూర్ : ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ రవికిరణ్‌యాదవ్

# బోథ్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు వెల్లువ

బోథ్, జూన్ 16 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆదివారం ఎంపీపీ తుల శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. నేరడిగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులకు కేక్ తినిపించారు. కార్యక్రమంలో నాయకులు బీ శ్రీధర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, బాబు సింగ్, దేవేందర్, రవి, పంద్రం శంకర్, భీముడు, రూప్‌చంద్, కిషన్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, జూన్ 16 : మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి శాలువాతో సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు రాజారాం, వినోద్, జనార్దన్, భూమన్న, చైతన్య, లక్ష్మణ్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్, జూన్ 16 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను నేరడిగొండలోని ఆయన నివాసంలో సాయి వైకుంఠ ట్రస్టు చైర్మన్, సినీ నిర్మాత, ప్రముఖ హోమియో వైద్యులు కాడిగిరి రవికిరణ్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట యాదవ సంఘ జిల్లా నాయకుడు కాడిగిరి రఘువీర్‌యాదవ్ ,ట్రస్టు ప్రతినిధులు ఉన్నారు.


బోథ్: ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


బోథ్ : మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

బోథ్, జూన్ 16 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం బోథ్ మండలం పొచ్చెర క్రాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో విజయోత్సవ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయకపోతే పథకాలు రావని బెదిరించారని గుర్తు చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి శత విధాలా ప్రయత్నించారన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఓటర్లతో పాటు బోథ్ నియోజకవర్గ ఓటర్లు పని చేసే తనను గుర్తించి ఓట్లు వేశారన్నారు. పార్లమెంట్ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, ఉపాధ్యక్షుడు మాధవ్ రావ్ అమ్టే, బోథ్ మండల శాఖ అధ్యక్షుడు బోరే రవీందర్, జడ్పీటీసీ రాజు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, బోథ్ సొసైటీ చైర్మన్ ప్రశాంత్, సుభాష్ సూర్య, దివాకర్ రెడ్డి, రమేశ్, అరుణ్ కుమార్, అప్టా కిషన్, జుగాదిరావ్, మహేందర్, మహిపాల్, గడ్డం భీంరెడ్డి, తుకారాం, వెంకటేశ్, జాదవ్ గోపాల్, నానం రమణ, నారాయణ పాల్గొన్నారు.

### మండల సమస్యలు పరిష్కరిస్తా

నేరడిగొండ, జూన్ 16 : మండలంలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి తప్పకుండా పరిష్కరిస్తానని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ విజయోత్సవ అభినందన సభను ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన విమర్శలను తిప్పికొట్టారు. జిల్లా అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి పని చేయిస్తామని అన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, జడ్పీటీసీ రాజు, మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్‌సింగ్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కుంటాల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ విద్యార్థులు

కుంటాల, జూన్ 16: కుంటాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98, 2003-04, 2007-08, 2009-10 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఫొటోలు దిగి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

## చల్లంగ చూడు.. పోచమ్మ తల్లీ..

సోన్, జూన్ 16 : ఈ ఏడాది పంటలు బాగా పండాలని అందరిని చల్లంగ చూడాలని కోరతూ సోన్, నిర్మల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం గంగనీళ్లతో జలాభిషేకం చేశారు. సోన్‌తో పాటు న్యూవెల్మల్, బొప్పారం, సిద్దలకుంట గ్రామాల్లో సమీపంలోని గోదావరి నదికి వెళ్లి గంగనీళ్లను తీసుకువచ్చి పోచమ్మ తల్లికి జలాభిషేకం చేసి మొక్కలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గంగ నీళ్లను ఆలయానికి తీసుకెళ్తున్న భక్తులు

## అడెల్లి ఆలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పూజలు


అడెల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

సారంగాపూర్, జూన్ 16 : మండలంలోని శ్రీమహా అడెల్లి పోచమ్మ ఆలయంలో ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ఎమ్మెల్యేకు హారతి, తీర్థ ప్రసాదాలను అందించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే విందు భోజనంలో పాల్గొన్నారు.

## విద్యుత్ ఫిర్యాదుల వేదిక

కుంటాల, జూన్ 16 : విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కల్లూరు సెక్షన్ ఆఫీస్‌లో ఉంటుందని వినియోగదారులు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కారం కోసం ఫిర్యాదు చేయాలని ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

## బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి


మజీద్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ హన్మాండ్లు

నర్సాపూర్(జీ), జూన్ 16: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మజీద్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హన్మాండ్లు మాట్లాడుతూ బక్రీద్ పండుగను సోదరభావంతో శాంతి యుతంగా జరుపుకోవాలని సూచించారు. ఆవులను వధించరాదని తెలిపారు. ఇతర జంతువులను రోడ్ల ప్రక్కన, ఇండ్లలో వధించడం కాని, వాటి వ్యర్థ పదార్థాలను వేయడం చేయకూడదని సూచించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలో మాత్రమే వేయాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్(జీ), చాక్‌పల్లి మజీద్ కమిటీ సభ్యులు సికిందర్, గౌస్, షబ్బీర్, అజ్జు, మౌలానా పాల్గొన్నారు.

## మత ప్రచారం చేస్తున్న పాస్టర్‌పై ఫిర్యాదు


ఏఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పెంబి, జూన్ 16 : నాగాపూర్ గ్రామంలో మత ప్రచారం చేస్తున్న పాస్టర్‌ను ఆదివారం స్థానిక ప్రజలు అడ్డుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మాయమాటలు చెప్పి మత మార్పిడికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. పాస్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పత్తి పంట పరిశీలన


హంపోలిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈవో నారాయణ

కుభీర్, జూన్ 16 : కుభీర్ మండలం హంపోలి గ్రామంలో పలువురు రైతులు డ్రిప్ సిస్టం కింద సాగు చేసిన పత్తి పంటను ఆదివారం సొనారి క్లస్టర్ ఏఈవో ఎం నారాయణ పరిశీలించారు. మొదటి దఫాలో డీఏపీ లేదా స్వర్ణపాల్ వేసుకోవాలని రైతులకు సూచించారు. 25 రోజుల వ్యవధిలో పత్తి పంటను ఆశించే రసం పీల్చు పురుగు, తెల్ల పచ్చ దోమ, పేనుబంక, తామర పురుగు, పిండినల్లి నివారణకు తయోమితక్సిన్, క్వినాల్‌ఫాస్ కలిపి మొక్క బాగా తడిచేలా స్ప్రే చేసుకోవాలన్నారు. మొక్కలకు కావాల్సిన పోషకాలు అందించే ఎన్‌పీకేను ప్రతి సారి ఖచ్చితంగా స్ప్రే చేయాలని సూచించారు. వర్షాధారిత పంటలను సాగు చేసే రైతులు నేల మంచిగా తడిసిన తర్వాతే విత్తనాలను నాటు కోవాలని కోరారు. ఇక్కడ రైతులు ఉన్నారు.

## కేంద్రాన్ని ఒప్పించి మాలీలకు ఎస్టీ హోదా ఇప్పించండి

ఎదులాపురం, జూన్ 16 : తెలంగాణ అసెంబ్లీలో మాలీలకు ఎస్టీ హోదా బిల్లు పాసై కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నందున కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించడానికి కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కూలే, రాష్ట్ర కోశాధికారి సతీశ్ కోరారు. ఆదిలాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఎంపీ నగేశ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎంపీగా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు. వారి వెంట రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, మరాఠా సంఘం నేతలు బోయర్ ప్రశాంత్ , విజయ్ ఉన్నారు.

## దుండగుడిని కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి

ఎదులాపురం, జూన్ 16 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైసుమిల్లులో బాలికపై లైంగికదాడి చేసి హతమార్చిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్నారిపై లైంగికదాడి, హత్య ఘటనపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలన్నారు. నిందితుడిని చట్టప్రకారంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి వలస కూలీలకు అన్ని విధాలుగా సౌకర్యాలు, పనికి తగిన కూలీ రేట్లు చెల్లించేలా కార్మిక శాఖ, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు గంగమ్మ, వర్ష, తార, సునీత పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఆత్రం సుగుణ

ఇంద్రవెల్లి, జూన్ 16: నిర్మల్ జిల్లా ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న ఇంద్రవెల్లికి చెందిన లింగంపల్లి గంగన్న ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్, గోవింద్, గణేశ్, నవీన్, విశాల్, భాస్కర్ ఉన్నారు.

## మేనేజర్, ఆఫీసర్‌కు సన్మానం


మేనేజర్, బ్యాంకు ఆఫీసర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 16 : నిర్మల్‌లోని ప్రియదర్శినినగర్‌లో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్మల్ శాఖ మేనేజర్ గుడిసె అరవింద్ అమరావతి(మహారాష్ట్ర)కు, ఆఫీసర్ నరేశ్ బెంగళూర్‌కు బదిలీ కాగా బ్యాంకు ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, అనిల్, రమణారెడ్డి, నాగేందర్, రాజు, వినోద్, రాజు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పదోన్నతికి దరఖాస్తుల ఆన్‌లైన్

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 16 : నిర్మల్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు గాను దరఖాస్తులు ఉచితంగా ఆన్‌లైన్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వై సాయన్న తెలిపారు. శనివారం రాత్రి 2.30 గంటల వరకు కార్యాలయంలోనే దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు పేర్కొన్నారు. సమయం ముగిసే వరకు ఆన్‌లైన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.